ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## దీపావళి శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు ప్రభాత ఉదయం దీపావళి శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం పత్రిక వెలువడదు. పునఃదర్శనం శనివారం.

- మేకల దామోదర్ రెడ్డి
ప్రభాత ఉదయం ఎడిటర్

సంపుటి: 2 | సంచిక: 203 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 31 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# దేశానికి రోల్‌మోడల్‌గా బిసి కులగణన





**కులగణన హామిని నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్**
**సోనియాకు ఇచ్చిన హామి అమలుచేసే యత్నం**
**భవిష్యత్ జనగణనకు ప్రామాణికంగా సర్వే**
**గాంధీభవన్‌లో పార్టీ సమావేశంలో సిఎం రేవంత్**

హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం): ప్రభుత్వం చేపట్టబోతున్న బిసి కులగణన దేశానికే రోల్ మోడల్‌గా మార్చాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బిసి కులగణన హామిని నిలబెట్టుకోవడం ద్వారా తెలంగాణను ఆదర్శంగా నిలుపుదామని అన్నారు. రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సోనియాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టి తీరుతామని స్పష్టం చేశారు. కులగణనపై గాంధీభవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి పార్టీ సమావేశంలో పాల్గొన్న సీఎం.. ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో మన తెలంగాణను మోడల్‌గా పరిగణనలోకి తీసుకునేలా డాక్యుమెంటును కేంద్రానికి పంపుతామని వివరించారు. కులగణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక అబ్జర్వర్లను నియమించాలని రేవంత్ రెడ్డి సూచించారు. బాధ్యతగా పనిచేయాలని కష్టానికి తగిన ఫలితం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా పార్టీ క్షమించదని హెచ్చరించారు. నవంబర్ 31లోగా ప్రక్రియ పూర్తి చేసి భవిష్యత్తు యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ నుంచి నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాల్సి ఉందని స్పష్టం చేశారు. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదని అది మెగా హెల్త్ చెకప్ లాంటిదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. నవంబర్ 6 నుంచి తెలంగాణలో కులగణన ప్రక్రియను ప్రారంభించ నున్నారు. దేశంలో తొలిసారిగా ఇక్కడ కులగణన చేపట్టనున్నారు. నవంబర్ 6న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తోంది. ఈమేరకు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి,

..మిగతా 2లో



# మూసీ సుందరీకరణతో పేదల ఇళ్ల కూల్చివేత


**ఇళ్ల కూల్చివేతను తప్పకుండా వ్యతిరేకిస్తాం**
**మల్లన్న సాగర్‌ను మించి మూసీకి పరిహారం ఇవ్వాలి**
**రేవంత్ పాదయాత్ర చేస్తే మేమూ వస్తాం**
**కుర్చీకాపాడుకునేందుకే రేవంత్ రెడ్డి తంటాలు**
**ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వంద సీట్లు ఖాయం**
**కేసులతో బెదిరింపులకు దిగితే భయపడేది లేదు**
**మాజీమంత్రిహరీష్ రావు విమర్శలు**

హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం): మూసీ సుందరీకరణకు తాము అనుకూలమేనని.. అయితే సుందరీకరణ పేరిట స్థిరాస్తి వ్యాపారానికి వ్యతిరేకమని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మూసీ పేరిట కమిషన్లు, పేదల ఇళ్లను కూల్చడం వంటి వాటిని వ్యతిరేకిస్తున్నా మన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసిత కాలనీ రాజమౌళి సినిమాను తలపిస్తోందంటూ ఎద్దేవా చేశారు. మల్లన్నసాగర్ బాధితులకు ఒక్క ఇల్లూ కట్టలేదని తప్పుగా మాట్లాడారని.. మల్లన్నసాగర్‌కు 50వేల ఎకరాలు కాదు.. 17వేల ఎకరాలేనన్నారు. 14వేల ఎకరాలు ప్రభుత్వ పట్టా అసైన్డ్ భూమి.. 3వేల ఎకరాలు ఫారెస్ట్ భూమి అని చెప్పారు. ఏడు గ్రామాలు ముంపునకు గురైతే 14 గ్రామాలు అయ్యాయని తెలిపారు. సీఎం ఇలా మాట్లాడుతూపోతే ఇక ఆయన మాటలను ఎవరూ నమ్మరన్నారు. మూసీ బాధితులకు మల్లన్న సాగర్‌కు మించిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ బాధితులకు గచ్చిబౌలి భూముల్లో ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. హైదరాబాద్

..మిగతా 2లో

# అయోధ్యలో అట్టహాసంగా దీపోత్సవం

**25 లక్షల దీపాల వెలగింపుతో గిన్నిస్ రికార్డు**
**అయోధ్య రామాలయ ప్రతిష్ట తరవాత తొలి ఉత్సవం**
**దీపహారతితో ధగధగలాడిన సరయూ తీరం**
**దోపోత్సవాన్ని ప్రారంభించిన సిఎం యోగి**



అయోధ్య, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం): రామప్రతిష్ట తరవాత వచ్చిన దీపావళి వెలుగులతో అయోధ్య ధగధగ లాడింది. సరయూ తీరం పులకించింది. భక్తజనం పరశించింది. దీపోత్సవంతో అయోధ్య వెలుగులు విరజిమ్మింది. దీపావళి సందర్భంగా అయోధ్యలోని సరయూ నది తీరాన దీపోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. లక్షల ప్రమిదలతో సరయూ తీరం

..మిగతా 2లో



# తితిదే చైర్మన్‌గా బీఆర్ నాయుడు

**పాలకమండలిని ప్రకటించిన ప్రభుత్వం**

అమరావతి, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం) తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పాలక మండలి నూతన ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు. 24 మంది సభ్యులతో తితిదే పాలకమండలి ఏర్పాటు కానుంది.

### తితిదే బోర్డు సభ్యులు వీరే..

జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే), వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (కోవూరు ఎమ్మెల్యే), ఎం.ఎస్ రాజు (మడకశిర ఎమ్మెల్యే), పనబాక లక్ష్మి (కేంద్ర మాజీ మంత్రి), జాస్తి పూర్ణ సాంబశివరావు, నన్నూరి నర్సిరెడ్డి (తెలంగాణ), శ్రీసదాశివరావు నన్నపనేని, కృష్ణమూర్తి (తమిళనాడు), కోటేశ్వరరావుచ, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, దర్శన్. ఆర్.ఎన్ (కర్ణాటక), జస్టిస్ హెచ్‌ఎల్ దత్ (కర్ణాటక), శాంతారామ్, పి.రామ్మూర్తి (తమిళనాడు), జానకీ దేవి తమ్మిశెట్టి, బూంగునూరు మహేందర్ రెడ్డి (తెలంగాణ),అనుగోలు రంగశ్రీ (తెలంగాణ), బూరగాపు ఆనందసాయి (తెలంగాణ), సుచిత్ర ఎల్ల (తెలంగాణ), నరేశ్కుమార్ (కర్ణాటక), డా. అదిత్ దేశాయ్ (గుజరాత్), సౌరభ్ హెచ్ బోరా (మహారాష్ట్ర)లు నియమితులయ్యారు.

# పంచాయితీలను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్రం

**కేంద్రం నిధులు ఇచ్చినా దారి మళ్లించిన రేవంత్**
**రు.1200కోట్లు విడుదల చేస్తే..కేవలం 200 కోట్లు ఖర్చు**
**సర్కార్ తీరుపై మండిపడ్డ బిజెపి ఎంపి రఘునందన్ రావు**

హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం): గ్రామాల అభివృద్ధిని కాంక్షించి కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని బిజెపి మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గ్రామాలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో పంచాయతీ సెక్రటరీలు కూడా సొంత డబ్బుతో పనులు చేయించారన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గ్రామాలు బాగుండాలని కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని రఘునందన్ రావు అన్నారు. ఆరునెలల క్రితం కేంద్రం 1200 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్ల నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మిగిలిన రూ.1000 కోట్ల నిధులను రేవంత్‌రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్న రఘునందన్.. పల్లె ప్రగతికి నిధులు వెచ్చించడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని.. కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే

..మిగతా 2లో



# పదేళ్ల పాలనలో చీకట్లు తొలగి పోయాయి

**ప్రజలకు దీపావళి శుభాకాంక్షల్లో సిఎం రేవంత్**

హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం): దీపావళి పండుగను పురస్కరించకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గత పదేండ్ల విధ్వంసపు పాలనలోని చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలనలో తెలంగాణ వెలుగులు విరజిమ్ముతుందని ముఖ్యమంత్రి ధీమా వెలిబుచ్చారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపు కోవాలని అన్నారు. ఈ దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.



# స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు కమిషన్

**తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్లను త్వరగా తేల్చితే స్థానిక ఎన్నికల్లో లబ్ది ఉంటుందని పిటిషనర్ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో విడుదల

..మిగతా 2లో



# దేశానికి రోల్‌మోడల్‌గా బిసి కులగణన

**మొదటి పేజీ తరువాయి...**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. కులగణన తర్వాత ఏయే సంక్షేమ కార్యక్రమాలకు ఎంత నిధులు కేటాయించాలో తెలిసే అవకాశం ఉంది. త్వరలో దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రులు తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో కులగణనపై సమావేశాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ హామీ మేరకు కులగణన చేస్తున్నామన్నారు. సర్వేతో అందరి సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశమంతా తెలంగాణను అనుసరిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నది బీసీ కులగణన కాదు.. సమగ్ర కులగణన అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కులగణన సర్వేను కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యం ఉన్న విషయంగా తీసుకుందన్నారు. కులగణన ఎక్స్ రే మాత్రమే కాదు మెగా హెల్త్ చెకప్ లాంటిదన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ అన్ని పరిస్థితులు చూశారు... కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కులగణన చేయాలని నిర్ణయించారు. కులగణన నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని అన్నారు. నవంబర్ 2న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో సమావేశం



నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానిస్తామని తెలిపారు. డిసెంబర్ 7 నాటికి కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తవుతుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆలోపు సమగ్ర కులగణన సర్వేను హైకోర్టుకు అందిస్తామన్నారు. రాహుల్ ఇచ్చిన మాటను నెరవేర్చబోతున్నామన్నారు. రాహుల్ ప్రధాని కావడానికి తెలంగాణ మోడల్ ఉపయోగపడుతుందన్నారు. నవంబర్ 31 లోగా కులగణన పూర్తి చేస్తామన్నారు. కులగణనపై నవంబర్ 5 లేదా 6 న రాష్ట్రస్థాయి సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యులను చేస్తామని చెప్పారు. కేంద్రం చేపట్టబోయే జనగణనలో ఓబీసీ కులగణను చేర్చాలని కోరుతామన్నారు. ప్రభుత్వ ఆదాయన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచుతామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు.. దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన పక్రియ ఈనెల 6 వ తేదిన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా అందరు సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికారులకు సహకరించాలని సూచించారు. 50 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు. తెలంగాణలో కులగణన పక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారాస నేతలు ప్రభుత్వాన్ని విమర్శించ డమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన కులాలకు చెందిన వారిపై భారాసకు ప్రేమలేదన్నారు. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా బలహీన వర్గాలకు చెందిన వ్యక్తినే కాంగ్రెస్ పార్టీ నియమిం చిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తూ.. అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించని కార్యక్రమాలనూ చేపడుతున్నామన్న విషయాన్ని ప్రతిపక్ష నేతలు గుర్తించాలని హితవు పలికారు.



వైస్ ఛాన్స లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కు ధన్యవాదాలు తెలుపుతున్న మహిళా అధ్యాపకులు, శాస్త్రవేత్తలు

## మహిళా అధ్యాపకులకు బేబీ కేర్ సెలవులను ఇవ్వడానికి ముందుకు రావడం సంతోషకరం: మహిళా శాస్త్రవేత్తలు

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో పనిచేస్తున్న మహిళా అధ్యాపకులు, శాస్త్రవేత్తలు బుధవారం వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు డాక్టర్ సుచరిత, డాక్టర్ భానురేఖ, డాక్టర్ సల్లా సౌజన్యలు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తున్న మహిళ అధ్యాపకులకు, ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకులు, శాస్త్రవేత్తలకు చైల్డ్ కేర్ సెలవులు ఇస్తున్నారని, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మాత్రం ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇదే విషయాన్ని ఈనెల 26న చైల్డ్ కేల్ సెలవులను ఇవ్వాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫసర్ ఆల్దాస్ జానయ్య ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. స్పందించిన ఆయన ఐదు రోజులలోనే సమస్య పరిష్కారాన్ని చూపి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకులు, శాస్త్రవేత్తలకు చైల్డ్ కేర్ సెలవులు ఇస్తూ మెమో 2460/సీసీ/క్లెయిమ్స్/ 2024, తేదీ 28 - 10 - 2024తో ఆర్డర్ ఇవ్వడం సంతోషకరమని వర్సిటీ మహిళా అధ్యాపకులు, శాస్త్రవేత్తలు అన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశంలో పాల్గొన్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి తదితరులు

## రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఐదు నుంచి పదిమంది అభ్యుదయ రైతులకు విశ్వవిద్యాలయం రూపొందించిన నాణ్యమైన విత్తనాల సరఫరా

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం బుధవారం జరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అధ్యక్షతన రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఈ సమావేశం జరిగింది. అనేక కీలకంశాలను పాలకమండలిలో చర్చించి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో నూతనంగా విత్తన విభాగం ఏర్పాటు చేసి దానికి ఒక సంచాలకుడి స్థాయి అధికారిని నియమించి రాష్ట్రంలో ఒక విత్తన నెట్ వర్క్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తద్వారా తెలంగాణలోని ప్రతి రెవిన్యూ గ్రామంలో కనీసం ఐదు నుంచి పది మంది అభ్యుదయ రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన నాణ్యమైన విత్తనాలను ప్రతి ఏటా సరఫరా చేయాలని పాలకమండలి నిర్ణయించింది. అందుకు గాను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్ కే వి వై) పథకం నుంచి ప్రత్యేక నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించింది. గత 13 ఏళ్ల నుండి ఇంచార్జి పాలనతో నడుస్తున్న స్థానాల్లో పూర్తిస్థాయి అధికారులను నియమించాలన్న అంశానికి పాలక మండలి ఆమోదం తెలిపింది. వ్యవసాయ విద్యకు పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని ఇటీవల భారీగా పెంచిన ప్రత్యేక కోట సీట్లకు.. భారీగా తగ్గించిన ఫీజులకు పాలకమండలి ఆమోదం తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాధిపతుల పదవికాలంను మూడేళ్లుగా నిర్ణయిస్తూ... ప్రతీ మూడేళ్లకో సారి రొటేషన్ పద్ధతిన, సీనియార్టీ ఆధారంగా విభాగధిపతులను నియమించాలని పాలకమండలి నిర్ణయించింది. ప్రస్తుతం ఒకసారి విభాగాధిపతిగా నియామకం అయితే అతను లేదా ఆమె పదవి విరమణ పొందే వరకు ఆ పదవిలో కొనసాగే వారు. దీనివల్ల ఇతర సీనియర్లకు అవకాశం కలగకుండా పోతుందని పాలకమండలి భావించి దేశంలో ఉన్న ఇతర విశ్వవిద్యాలయాలలో మాదిరిగా ఈ రొటేషన్ పద్ధతిలో విభాగ అధిపతులను నియమించాలని నిర్ణయించింది. వివిధ కళాశాలలో అనుబంధ పీఠాధిపతుల (అసోసియేట్ డీన్) నియామకం, అలాగే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాల అనుబంధ పరిశోధనా సంచాలకుల (అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్) సీనియార్టీ ప్రాతిపదికన నియామకం చేపట్టాలని, వారి పదవీ కాలాన్ని రెండేళ్లుగా నిర్ణయిస్తూ.. అలాగే మరో రెండేళ్ల వరకు పొడిగించే వెసులుబాటును కల్పిస్తూ అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే విధంగా పాలకమండలి ఈ మేరకు నిర్ణయించింది. ఇటీవల యు.జి. సి ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ అనుభవం కలిగిన ప్రముఖ వ్యవసాయ శాస్త్ర నిపుణులను ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ గా ఏడాది కాలపరిమితితో మూడేళ్ల వరకు నియమించుకోవడానికి వెసులుబాటు కల్పిస్తూ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. దీనివల్ల జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో పేరెన్నిక కలిగిన నిపుణుల యొక్క నైపుణ్యతను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధన, పరిశోధనలలో ఉపయోగించుకోవాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నది. గత 7, 8 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్లుల చెల్లింపులను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు నాలుగు దఫాలుగా విడుదల చేయాలని పాలకమండలి నిర్ణయించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రస్తుత ఉద్యోగులు, పెన్షనర్లకు గత ఐదేళ్ల క్రితం నుంచి నిలిపివేసిన యూనివర్సిటీ ఆరోగ్య కేంద్ర సేవలను పునరుద్ధరిస్తూ ఉపకులపతి అల్దాస్ జానయ్య ఇటీవల తీసుకున్న నిర్ణయానికి పాలకమండలి ఆమోదముద్ర వేసింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించి 60 సంవత్సరలు పూర్తయిన సందర్భంగా ఈ డిసెంబర్ లో విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించాలని పాలకమండలి నిర్ణయించింది.

## మూసీ సుందరీకరణతో పేదల ఇళ్ల కూల్చివేత

**మొదటి పేజీ తరువాయి...**

నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేద్దాం. సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా పాదయాత్రకు రావాలని షరతు విధించారు. మమ్మల్ని డీల్ చేయడం కాదు.. రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవాలి. పక్కనున్న వాళ్లే ఆయన్ను దించేయకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వం వచ్చి ఏడాదైనా.. 6 మంత్రి పదవులు నింపుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే భారాసకు 100 సీట్లు రావడం ఖాయమని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు వంద సీట్లు వస్తాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని స్పష్టం చేశారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని.. రేవంత్ సీఎం అయ్యేవాడు కాదన్నారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. సీనియర్లు తన కుర్చీని గుంజుకోకుండా రేవంత్ చేసుకోవాలని.. తన కుర్చీని ఎప్పుడు గుంజుకుపోతారోనన్న భయంలో రేవంత్ ఉన్నాడన్నారు. ఐదేళ్ల తర్వాత వచ్చేది బీఆర్ఎస్ మాత్రమేనని.. సీఎం అయ్యేది కేసీఆర్ అని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడుసార్లు ఓడిందని.. మరి కాంగ్రెస్ ఖతం అయిపోయిందా? అంటూ ప్రశ్నించారు. 31 సాకులు చూపుతూ రుణమాఫీ చేయకుండా రేవంత్ రైతులను మోసం చేశారని విమర్శించారు. మంత్రి పదవులు నింపేందుకే రేవంత్‌కు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదని.. విద్య, మైనారిటీ, పోలీసుశాఖలకు మంత్రులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ లేరన్నారు. కేసీఆర్ పవర్‌ఫుల్ ఫైటర్, లీడర్ అని చెప్పారు. రేవంత్‌రెడ్డి చిల్లరమాటలు ఆపితే మంచిదని సూచించారు. ఓ మంత్రి గవర్నర్‌ని కలిశారని.. ఇంకో మంత్రి కాబోయే సీఎంనని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారని అన్నారు. సీఎం చిట్‌చాట్‌లో మాట్లాడి కుర్చీకి ఉన్న గౌరవం తగ్గించారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అబద్దాలు చూసి గోబెల్స్ కూడా సిగ్గుపడుతారన్నారు. రేవంత్ మాట్లాడితే ఎక్కడ ఆ దుర్భాష విని పిల్లలు చెడిపోతారోనని.. ఇండ్లల్లో తల్లిదండులు టీవీలను బంద్ చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు మూడువైపులా సముద్రం ఉందంటారని.. అలా అయితే గోవా వెళ్లడం ఎందుకని జోకులు వేస్తున్నారన్నారు. రాజీవ్ కంప్యూటర్ కనిపెట్టాడని అంటాడని.. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతారని.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండీ ఇలా మాట్లాడుతూ పోతే.. గ్రూప్-1 పరీక్ష రాసేవాళ్లు ఏమైపోవాలని అన్నారు. తాను కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. సన్యాసం తీసుకోకుండా ఎంపీకి ఎందుకు పోటీశారని నిలదీశారు. శుద్ధమైన నదీ జలాలకు బీఆర్ఎస్ అనుకూలమని.. పేదల ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకమని క్లారిటీ ఇచ్చారు. కాళేశ్వరం మంచినీళ్లు మూసీకి తీసుకురావాలన్నది కేసీఆర్ విజన్ అని తెలిపారు. కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తెచ్చేందుకు కేసీఆర్ డీపీఆర్ చేశారన్నారు. కొండపోచమ్మ సాగర్ కాకుండా మల్లన్నసాగర్ నుంచి ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. రూ.1100కోట్లతో అయ్యే పనిని రూ.7వేలకోట్ల కమిషన్ కోసం పెంచారని మండిపడ్డారు. గచ్చిబౌలిలో 450 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని.. మూసీ బాధితులకు ఆ స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.75కోట్లకు ఎకరా భూమి అమ్మింది రేవంత్ ప్రభుత్వమేనన్నారు. 2013 యాక్ట్ కంటే బాగా ఇవ్వమని తాము అడుగుతున్నామన్నారు. రేవంత్ పాలనలో ఇండ్లు కూల్చారు తప్పా.. ఒక్కటైనా కట్టారా? అని హరీశ్‌రావు నిలదీశారు. ఏక్ పోలీసింగ్ కోసం పోలీసుల పోరు జరుపుతున్నారని.. రేవంత్ చెప్పిందే వారు అడుగుతున్నారన్నారు.అంబేద్కర్ విగ్రహానికి సీఎం దండ వేయరని.. అక్కడికి ఎవరినీ వెళ్లనీయరంటూ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ తప్పుడు విధానాలతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్ పెరిగిపోతున్నా.. తెలంగాణలో మాత్రం ఎందుకు తగ్గుతోందని నిలదీశారు. హైడ్రా ఎఫెక్ట్‌తో రియల్ ఎస్టేట్ రంగం ధమాల్ ధమాల్ అయ్యిందన్నారు. రేవంత్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే తప్పుడు కేసులు పెట్టున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులతో తనను.. కేటీఆర్‌ను ఇరికించాలని చూస్తున్నారని ఆరోపించారు. తమపైనే కాకుండా ప్రశ్నించే గొంతులపైనా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందన్నారు. హైదరాబాద్‌లో 144 సెక్షన్ పెట్టడం తుగ్లక్ చర్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి, దురాలోచనతోనే ఆర్ఆర్ఆర్‌కు రూ.35వేలకోట్ల ఖర్చు అని అంటున్నారని.. కేంద్రం ఫ్రీగా చేస్తున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయడం ఎందుకని నిలదీశారు. అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం 11 నెలల్లోనే రూ.85వేలకోట్ల అప్పులు చేసిందన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, మూలధన పెట్టుబడి, సంక్షేమ పథకాల కోసం చేసిన అప్పు రూ.4,26,499కోట్లు మాత్రమేనన్నారు. పదినెలల కాంగ్రెస్ పాలనలోనే రూ.85వేలకోట్ల అప్పులు తీసుకున్నట్లుగా క్లియర్‌గా ఉందని.. బడ్జెటేతర రుణాల వివరాలను తమకు చెప్పలేదని కాగ్ తన నివేదికలో చెప్పిందని గుర్తు చేశారు. అప్పుల వివరాలు ఎందుకు చెప్పడం లేదని.. ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. తీసుకున్న రుణాలను ఏం చేస్తున్నారని నిలదీశారు. రేవంత్‌కు ఫుట్‌బాల్ ఒక్కటే వచ్చని.. తనకు క్రికెట్ కూడా తెలుసునన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోల్ కొట్టేది.. వికెట్ తీసేది తామేనన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు కమిషన్

**మొదటి పేజీ తరువాయి...**

చేసింది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగించింది. దీనిని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసే బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఒకటి రెండు నెలల పాటు రాష్ట్రంలో బీసీ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక అందిస్తుంది. గతంలో మహారాష్ట్రలో ఇలాగే బీసీ కమిషన్ చేసిన అధ్యయనాన్ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది. ఇక్కడ నివేదిక సమర్పించిన తర్వాత అదేవిధంగా జరిగితే సమయం వృథా అవుతుంది. అందువల్ల ఇప్పుడే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ తరపున మాజీ అడ్వొకేట్ జనరల్ ప్రసాద్ కోర్టును కోరారు.

## పంచాయితీలను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్రం

**మొదటి పేజీ తరువాయి...**

ఖర్చు చేసి మిగిలిన నిధులు దారి మళ్లించారని మండిపడ్డారు. ఆ బిల్లులు ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.600 కోట్లు పెండింగ్‌లో పడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెకమండేషన్ మేరకు రూ.500 కోట్లు విడుదల చేసిందని.. నేషనల్ హెల్త్ మిషన్ కోసం 300 కోట్ల రూపాయలు విడుదల చేసిందని చెప్పారు. హెల్త్ సెంటర్ నిర్మాణం చేయాలని చెప్పిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో గ్రామాలలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేసినా తెలంగాణ సర్కార్ వాటిని దారి మళ్లించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కావాలి కానీ కేంద్రం పేరు చెప్పేందుకు మనసు రాదంటూ మండిపడ్డారు. నియోజకవర్గానికి 3,500 ఇల్లు కట్టిస్తామని చెప్పిందని.. వాటిని కట్టేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని.. ఆ నిధులను కూడా అర్బన్ మిషన్ కింద సేకరిస్తోందన్నారు. వాటిని ఎవరు పంచాలనేది దానిపై కొట్లాట మొదలైందన్నారు. కలెక్టర్‌లతో కాకుండా గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల చేతుల మీదుగా ఆ నిధులు అందజేస్తామని చెబుతున్నారన్నారు. మునిసిపాలిటీలలో 250 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం విడుదల చేసిందన్నారు. మా పైసలు తీసుకుని మా భాగస్వామ్యం లేకుండా ఇళ్లను పంచిపెడితే కచ్చితంగా అడ్డుకుంటాం. ఇందిరమ్మ కమిటీలు చెల్లుబాటు కావు. ప్రతి స్కీంకు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లు పెట్టే భావదారిద్య్రం ఉంది. మూసీ శుద్ధి, సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు . అభివృద్ధి పేరుతో కార్పోరేట్ కంపెనీలకు పనులు అప్పజెబితే మాత్రం వ్యతిరేకిస్తాం. మూసీకి కొండ పోచమ్మ సాగర్ నుంచి నీరు తెస్తే 1500 కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. మల్లన్న సాగర్ నుంచి నీరు తెస్తే 7వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. పేదోళ్లు కట్టిన ఇంటి వద్ద 50 మీటర్ల దూరం అభివృద్ధి చేస్తాం అంటున్నారు. మూసీ అభివృద్ధిలో క్విడ్ ప్రోక్రో ఉన్నట్లు అనుమానం ఉంది. ప్రజలు బీఆర్ఎస్‌కు సీఆర్ఎస్ ఇచ్చారు.. వారిని ఫాం హౌస్‌లకు పరిమితం చేశారు. పేదోళ్లకు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇస్తుంది. కుక్కతోక పటాకులు పేలుస్తారా .. సుతీల్ బాంబు పేలుస్తారా చూడాలి. అదిపేలుస్తాం ఇది పేలుస్తాం అని బ్రేకింగ్ ప్లేట్ల కోసం మాట్లాడకుండా అవినీతిపరులను అరెస్టు చేస్తే మేం స్వాగతిస్తాం అని ఎంపీ రఘునందర్ రావు వెల్లడించారు.

## అయోధ్యలో అట్టహాసంగా దీపోత్సవం

**మొదటి పేజీ తరువాయి...**

దేదీప్యమానంగా వెలిగిపోయింది. రామమందిరం ప్రారంభమైన తర్వాత తొలిసారి వేడుకలు కావడంతో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. గిన్నిస్ రికార్డుల్లోకెక్కేలా ఉత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఇందుకు సంబంధించి 55 ఘాట్‌లలో ఏర్పాటు చేసిన ప్రమిదలను ప్రత్యేక డ్రోన్లతో గిన్నిస్ ప్రతినిధులు లెక్కించారు. 25 లక్షల దీపాలను వెలిగించాలని లక్ష్యంగా పెట్టుకున్న నిర్వాహకులు.. దాదాపు 28 లక్షల ప్రమిదలను ముందస్తుగానే ఆర్డర్ చేశారు. రామమందిరంతోపాటు పరిసర ప్రాంతాలను దీపాలతో అలంకరించారు. దీపోత్సవ కార్యక్రమంలో 30వేల మంది వాలంటీర్లు పాల్గొన్నారు. ఓ ఘాట్ వద్ద 80వేల దీపాలతో స్వస్తిక్ ఆకారంలో దీపాలను వెలిగించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆవు నెయ్యితో లక్షన్నర దీపాలను వెలిగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేసి.. హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మయన్మార్, నేపాల్, థాయిలాండ్, మలేసియా, కంబోడియా, ఇండోనేసియాకు చెందిన కళాకారులతో వేదిక వద్ద ప్రదర్శన నిర్వహించారు.ఘాట్‌ల వద్ద దాదాపు 5 నుంచి 6వేల మంది అతిథుల కోసం ఏర్పాట్లు చేశారు. లైవ్ కవరేజీ కోసం పెద్ద తెరలు ఏర్పాటు చేశారు. నగరం మొత్తం దాదాపు 10వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. మొత్తంగా బాలరాముడు కొలువైన అయోధ్యలో దీపావళి సంబరాలు కన్నులపండువగా మొదలయ్యాయి. సరయూ నదీ తీరంలో ఎనిమిదేళ్లుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'దీపోత్సవం' ఈసారి మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. అయోధ్యలో భవ్య రామాలయం నిర్మాణం జరిగిన తర్వాత జరిగిన తొలి దీపోత్సవం ఇదే కావడంతో అయోధ్య నగరం దీపకాంతులతో మెరిసిపోయింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'దీపోత్సవ్'ను ప్రారంభించగా, భక్తులు ఏకకాలంలో 25 లక్షలకుపైగా దీపాలు వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. సరయూ నది ఘాట్‌లో 1,100 మంది హారతులు ఇవ్వడం ద్వారా మరో సరికొత్త రికార్డు కూడా సిద్ధమైంది. అయోధ్య పురవీధుల్లో లక్షలాది జనవాహిన మధ్య రామలక్షణ వేషధారులు రథంపై ఊరేగగా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా రథం లాగి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. లేజర్ షోలు, డ్రోన్ షోలు, రామాయణ ఘట్టాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అయోధ్య మారుమోగింది. రామాలయ నిర్మాణం తర్వాత జరిగిన తొలి దీపోత్సవ్‌ను యోగి ఆదిత్యనాథ్ ప్రారంభిస్తూ, ఈనాటి దీపోత్సవ్ మనందరికీ గర్వకారణమని అన్నారు. ఇది మనమంతా జరుపుకుంటున్న 8వ దీపోత్సవమని చెప్పారు. ఎనిమిదేళ్ల క్రితం తొలి దీపోత్సవ్ జరుపుతున్నప్పుడు... యోగీజీ రామమందిరం నిర్మించడని ప్రతి ఒక్కరూ అడిగేవారని, రాముడు త్వరలోనే మనందరికీ ఆశీర్వదిస్తాడని ఆరోజు చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. రామాలయ నిర్మాణం కలసాకారమైనందుకు ప్రధాని మోదీకి మనమంతా కృతజ్ఞతలు చెప్పుకోవాలని అన్నారు. యావద్దేశం కోవిడ్ మహమ్మారితో పోరాడుతున్న సమయంలో ప్రధాని అయోధ్యకు వచ్చిన రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. ఈరోజు అయోధ్య వెలిగిపోతోందని, ఇవాళ వెలుగుతున్నవి కేవలం దివ్వెలు కావని, సనాతన ధర్మ విశ్వాసని చెప్పారు.

# నవంబర్ 1వ తేదీ రాత్రి 9 గంటలకు బుద్వేల్‌లో సదర్ సమ్మేళనం: మజ్జిగ నరేష్ యాదవ్



సదర్ కు రావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోలుకంటి ప్రకాష్ గౌడ్ కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మజ్జిగ నరేష్ యాదవ్, చిత్రంలో పెండ్యాల సాయి మల్లిక్



మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రా రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బుద్వేల్ కు చెందిన యాదవ సోదరులు




బీ ఆర్ ఎస్ యువ నేత పట్లోళ్ల కార్తిక్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మజ్జిగ నరేష్ యాదవ్, యాదవ సోదరులు

బుద్వేల్, అక్టోబరు 30(ప్రభాత ఉదయం): నవంబర్ 1వ తేదీ శుక్రవారం రాత్రి 9 గంటలకు బుద్వేల్ శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ యాదవ సంఘం ఉపాధ్యక్షులు, బుద్వేల్ కు చెందిన మజ్జిగ నరేష్ యాదవ్ (లడ్డు పహిల్వాన్) ఓ ప్రకటనలో తెలిపారు. బుద్వేల్, రాజేంద్రనగర్, బన్సీలాల్ నగర్, ఇంద్రానగర్, గ్రీన్ సిటీ, ఎన్ పి పి టి ఐ , పీడీపీ , కిస్మత్ పూర్ బస్తీల నుంచి యాదవ సోదరులు తమ దున్నలను తీసుకొని సదర్ సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. ఈ సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోలుకంటి ప్రకాష్ గౌడ్, మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి , బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ళ కార్తీక్ రెడ్డి, యాదవ సంఘం రాష్ట్ర, జిల్లాల నాయకులు, రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి , పొడవు అర్చన జయప్రకాష్, ఎం . సంగీత గౌరీ శంకర్ లు పాల్గొంటారన్నారు.



బుద్వేల్ యాదవ సంఘం నాయకుడు మజ్జిగ నరేష్ యాదవ్ (లడ్డు పైల్వాన్)



లబ్ధిదారులకు షాది ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో రూ. 6.65 కోట్ల కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కుల పంపిణీ

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం): పేదింటి ఆడపడుచులకు మేన మామగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి వారి వివాహాలకు లక్ష 116 ల చొప్పున కేటాయించడం సంతోషకరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండలంలోని 665 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.6.65.77, 140 లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఒక్క రాజేంద్రనగర్ మండలంలోనే ఆరున్నర కోట్లను పంపిణీ చేస్తే రాష్ట్రమంతటా ఎన్ని కోట్లు పంపిణీ చేస్తున్నారో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాగా పనిచేస్తుందని, ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరమే అవుతుందని, ఇంకా నాలుగు సంవత్సరాలు ఉందని ఒక్కొక్క పని జరుగుతూ వస్తుందన్నారు. మూసీ సుందరీకరణ ను కొందరు వ్యతిరేకిస్తున్నారని , మూసీ అభివృద్ధి కావాలి కదా అని గుర్తు చేశారు. ఎవరి ఇండ్లు పోవని, ఒకవేళ ఇండ్లు పోతే వారికి ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ బి .రాములు , కాంగ్రెస్ పార్టీ నాయకులు బొక్క ప్రభాకర్ రెడ్డి, ఎం యాదమ్మ యాదవ్, పడమటి శ్రీధర్ రెడ్డి , సయ్యద్ ముజమిల్ అహ్మద్, షేక్ ఫహీం , మహమూద్ పాషా, షేక్ మతిన్, ఎం .ప్రభాకర్ రెడ్డి, జాఫర్, షౌకత్ , తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అబ్దుల్ వకీల్. చిత్రంలో గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్ లు

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో సోషియో ఎకనామికల్ సర్వే నిర్వహిస్తాం

**ప్రతి ఇంటికి వెళ్లి ఆర్థిక సామాజిక రాజకీయ విద్యా వివరాలు సేకరిస్తాం**

**ప్రజలందరూ సహకరించాలి : జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్**

బుద్వేల్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం): నవంబర్ 1వ తేదీ నుంచి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ లలో నివాసం ఉంటున్న ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబ, ఆర్థిక, సామాజిక, విద్య పర మైనటువంటి అంశాలను సేకరించడం జరుగుతుందని గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె .రవి కుమార్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు ఈ సోషియో ఎకనామిక్ సర్వే చేపడుతున్నామన్నారు. బుధవారం పీ డీ పీ చౌర స్తాలోని ఐబి ఫంక్షన్ హాల్ లో ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్యూమరేటర్లు ఎలాంటి వివరాలు సేకరించాలి అనే విషయంపై ప్రత్యేక శిక్షకులుగా వచ్చిన అబ్దుల్ వకీల్ వివరించారు. ప్రజలకు మెరుగైన పథకాలు తీసుకురావడానికి ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.



బహుమతులు అందుకుంటున్న చిన్నారులు



చిన్నారులకు మెడల్ వేస్తున్న అధ్యాపకులు

## క్రీడల్లో చిన్నారుల ప్రతిభ

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం): అత్తాపూర్ లోని బ్రిగేడ్ పబ్లిక్ స్కూల్ లో బుదవారం 4వ వార్షిక స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీలలో 100మీటర్ల పరుగు పందెం లో కె. స్నిగ్ధరాజ్ ప్రధమ బహుమతి, వేదాంషి 2వ బహుమతి, ప్రియ 3వ బహుమతి గెలుచుకున్నారు. అవార్డులను ప్రిన్సిపాల్ రుక్మిణిరెడ్డి, అడ్మిన్ విశాంత్‌రెడ్డి, సిబ్బంది అందజేశారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాండురంగా నగర్ లో మంగళవారం రాత్రి జరిగింది. పాండు రంగా నగర్ కు చెందిన మంగ్యా నాయక్ (37 ) లారీ కొని నడుపుకుంటున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో మనస్థాపాని గురైన మంగ్యనాయక్ మంగళవారం ఇంట్లో అందరూ నిద్రపోయాక ఇంటి పైకప్పుకు చీరతో ఉరి వే సుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్య రాత్రి నిద్ర లేచిన భార్య భర్త ఉరి వేసుకోవడం చూసి స్థానికులు, బంధువుల ద్వారా అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది . కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న మంగ్యా నాయక్



దీపావళి పండుగ పూజల కోసం హైదర్ గూడ లో పూజా సామాగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు

## నేడే దీపావళి

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గురువారం దీపావళి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించడానికి ప్రజలు సన్నాహాలు చేస్తున్నారు. దీపావళి పండుగ కోసం పూజా సామాగ్రి కొనుగోలు చేస్తున్న దుకాణాలు కిట కిట లాడుతున్నాయి . హైదర్ గూడ బస్తీలో చెరుకు గడలు గడలు, బంతిపూలతో దుకాణాలను అందంగా ముస్తాబు చేసి పూజా సామాగ్రి, పండ్ల విక్రయాలను చేస్తున్నారు.




సయ్యద్ హిదాయతుల్లా షఫీ, సుజాత్ పటేల్ లను సన్మానిస్తున్న సయ్యద్ ముజమిల్ అహ్మద్ తదితరులు

## సామాజిక సేవలో ముందున్న సయ్యద్ హిదాయతుల్లా షఫీ, సుజాత్ పటేల్‌లను సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

బుద్వేల్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం): సామాజిక సేవలో పాలుపంచుకుంటూ పదిమందికి సేవ చేస్తున్న హ్యాపీ హోమ్స్ కాలనీ చెందిన సయ్యద్ హిదాయతుల్ల షఫీ, సూజాత్ పటేల్ లను బుధవారం ముస్లిం పెద్దలు సయ్యద్ ముజమీల్ అహ్మద్ తదితరులు సన్మానించారు. ముస్లీం లకు అండగా ఉంటూ, అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న సయ్యద్ హిదాయతుల్ల షఫీ, సుజాత్ పటేల్ లు ఆయురారోగ్యాలతో ఉండాలని అల్లా ను ప్రార్థిస్తున్నామన్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న వనంపల్లి జైపాల్ రెడ్డి.

## ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం): మైలార్ దేవుపల్లి చౌరస్తాలో బుదవారం ఏఐటియుసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ప్రారంభించారు . బుధ, గురువారాలలో ఈ వేడుకలు నిర్వహించనున్నారు . ఈ సందర్భంగా మైలార్ దేవ్ పల్లి చౌరస్తాలోని ఏఐటియుసి జెండాను వనంపల్లి జైపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ఏఐటియుసి ఆవిర్భావం జరిగిందన్నారు . ఆనాడు భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాటం నిర్వహించిన ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అన్నారు, బ్రిటిష్ కాలంలోనే కార్మికులకు పిఎఫ్, గ్రాడ్యుటి చట్టాలను తీసుకువచ్చిందని నాటి నుండి నేటి వరకు కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గత పాలనలో కార్మికులు పోరాడి సాగించుకున్న 29 చట్టాలను రద్దుచేసి 4 కోడ్ లుగా మార్చడం కార్మికుల హక్కులను కాలరాయడమేనని అన్నారు. ఇప్పటికైనా కార్మిక చట్టాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సందర్భంలో ఉద్యోగ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాజేంద్రనగర్ మండల కార్యదర్శి టి.ఆనంద్ , ఉపాధ్యక్షులు, ఎస్.రాజు, శ్రీను , మహేందర్ , మురళి , సంతోష , శంకరమ్మ , శ్యామలమ్మ , లక్ష్మి , మంగమ్మా ,ఉషారాణి, నాయకులు పాల్గొనడం జరిగింది



శివరాంపల్లి లోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో జరిగిన దీపావళి లక్ష్మీదేవి పూజల్లో పాల్గొన్న ఎస్ ఇ శ్రీ రామ్ మోహన్

## గగన్ పహాడ్ విద్యుత్ ఈఆర్ఓ కార్యాలయంలో ఘనంగా దీపావళి లక్ష్మీదేవి పూజలు

**పూజల్లో పాల్గొన్న ఎస్ ఈ శ్రీరామ్ మోహన్, ఎస్ ఏ ఓ లోకేశ్వరయ్య**

రాజేంద్రనగర్, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి లోగల విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో దీపావళి సందర్భంగా లక్ష్మీదేవి పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. బుధవారం శివరాంపల్లిలోని గగన్ పహాడ్ విద్యుత్ ఈఆర్ఓ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి నాగమణి ఆధ్వర్యంలో జరిగిన లక్ష్మీదేవి పూజల్లో విద్యుత్ రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ ఇ డి శ్రీరామ్మోహన్, ఎస్ఏఓ లోకేశ్వరయ్య, అకౌంట్స్ ఆఫీసర్లు కొండారెడ్డి, శేఖర్, అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్లు ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్లు దుర్గాప్రసాద్, రవీందర్, శ్రీనివాస్, సురేష్ రెడ్డి, మల్లేష్ రాజ్, అమర్ సింగ్, షేక్ భాషా, ప్రవీణ్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు హరిణి, వేణుగోపాల్, ఉద్యోగులు మల్లేష్, కిరణ్ లు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో గల ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం): తప్పుడు పత్రాలతో శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో సర్వేనెంబర్ 23 లో 500 గజాల ప్రభుత్వ భూమిని స్థానిక నాయకుడు సాంబ ఆంజనేయులు కబ్జా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు ఎం ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ని కలిసి ఫిర్యాదు చేశాడు. సాంబ ఆంజనేయులు 2016లో అదే ప్రాంతంలో గల 350 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి జీవో నెంబర్ 59 ప్రకారం క్రమబద్ధీకరించు కున్నాడన్నారు అలా క్రమబద్ధీకరించుకున్న స్థలంలో మూడంతస్తుల భవనం నిర్మాణం చేశాడన్నారు. ఆ స్థలం పక్కన ఖాళీగా ఉన్న మరో 500 గజాల స్థలాన్ని ఆక్రమించి పాత పేపర్లను చూయించి కబ్జా చేసి ప్రహరీ నిర్మించాడన్నారు . ఈ విషయమై రాజేంద్రనగర్ తహసిల్దార్ కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చాడు.



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి శివరాంపల్లి లో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందని ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఏం ప్రభాకర్ రెడ్డి

# మెహిదీపట్నం విద్యుత్ కార్యాలయంలో దీపావళి లక్ష్మీదేవి పూజలు



మెహదీపట్నం విద్యుత్ కార్యాలయంలో నిర్వహించిన దీపావళి లక్ష్మీదేవి పూజల్లో పాల్గొన్న డి ఈ ప్రవీణ్



పదవి విరమణ చేసిన ఏ ఏ ఓ సలీం ను సన్మానిస్తున్న అధికారులు



రేతిబౌలి ఈ ఆర్ ఓ లో జరిగిన లక్ష్మీదేవి పూజల్లో ఏ ఏ ఓ ఉదయ్

మెహిదీపట్నం, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం) మెహిదీపట్నంలోని విద్యుత్ కార్యాలయంలో దీపావళి పండుగను పురస్కరించుకొని లక్ష్మీదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మెహిదీపట్నం విద్యుత్ డి ఈ కార్యాలయం, రేతిబౌలి విద్యుత్ ఈ ఆర్ ఓ కార్యాలయంలో జరిగిన దీపావళి లక్ష్మీదేవి పూజల్లో డిఇ ప్రవీణ్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ ఉదయ్ లు పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఏ డి ఈ, ఏఈ, జే ఏ ఓ లు మల్లేష్,రవికుమార్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , కాంట్రాక్టర్ శేఖర్ రెడ్డి , ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఆర్పీలకు నెలకు 26,000 వేతనం ఇవ్వాలి

కొత్తకోట, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం) జీవో నెంబర్ 60 ప్రకారంగా ఆర్పిలందరికీ నెలకు 26,000 కనీస వేతనము అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు.బుధవారం కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ పి సుకేశిని కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత కొన్ని సంవత్సరాలుగా ఆర్పీలు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతున్నారని పని మాత్రం అధికంగా ఉన్న వేతనాలు మాత్రం చాలా తక్కువ ఇస్తున్నారని ఆయన అన్నారు. రోజువారీగా నిత్యవసర వస్తువుల ధరలు పెరుగు తున్నాయని ఏమి కొనేటట్టు లేదు, ఏమి తినేటట్టు లేదు, అన్న చందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం యూనిఫామ్ లు కూడా ఇవ్వకపోవడం మరి దారుణమని ఆయన చెప్పారు. ప్రభుత్వము ఆర్పి లను గుర్తించి కనీ వేతనాలు అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆర్పీల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ ఒకటవ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా ఉంటుందని ఆర్ పీలందరూ ధర్నా లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పి లావణ్య, జగదీశ్వర్ రెడ్డి ,జలజ,యాస్మిన్ ఖాతాన్,పద్మ, స్వప్న,లక్ష్మీ,సౌజన్య, సోనీ, సుజాత,అంజుమ్,తదితరులు పాల్గొన్నారు.




## మాదక ద్రవ్యాలను దరిచేరనీయకండి

### మండలం విద్యాధికారి సురేష్

మల్దకల్, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం) మల్దకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఏర్పడిన ప్రహరీ క్లబ్బులను సమావేశపరిచి అదేవిధంగా విద్యార్థిని, విద్యార్థులను హాజరు పరిచి మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ... ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారినపడి తమ భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోకూడదని తెలిపారు. కాలేజీల నుంచి పాఠశాలలకు సైతం ఈ జాడ్యం పాకింది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.ఇందులో భాగంగా విద్యార్థులను కాపాడేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖను ప్రభుత్వం ఆదేశించింది. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలల్లో మాదకద్రవ్యాల వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టి, విద్యార్థులను వాటికి దూరం చేయాలని సూచించింది. ఇందుకు 'ప్రహరీ క్లబ్'లు ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.ఇందులో తరగతికి ఇద్దరు చొప్పున చురుకైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఘం నుంచి ఒకరు, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఒకరిని ఎన్నుకొన్నామని తెలిపారు. వీరంతా విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా శ్రద్ధ కనబరుస్తారని ,ఈకమిటీ లక్ష్యాలు.విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా నిఘా పెట్టలాన్నారు.పాఠశాలల్లో విద్య, శిశు సంరక్షణ సంస్థల పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల అమ్మకాలను అరికట్టా లన్నారు.మాదకద్రవ్యాలకు సరఫరా అలవాటు పడిన విద్యార్థులు ఉంటే వారిని గుర్తించి అప్రమత్తం చేసి వాటి దుష్ప్రభావాలను వివరించి మాన్పించాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పిల్లల్ని ఉపయోగిస్తే తగిన చర్యలు, జాగ్రత్తలు తీసుకుని కట్టడి చేయలన్నారు.పాఠశాల ఆవరణలో, చుట్టుపక్కల మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండలన్నారు.విద్యార్థులు డ్రగ్స్ ఊబిలో చిక్కుకోకుండా చక్కని ప్రణాళికలను రూపొందించి అమలు చేయలన్నారు. పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధాలు, పదార్థాలు, ఇతర రకాల వస్తువులు వారి దరి చేరకుండా నిరోధించడం. మొదలగు అంశాల గురించి చర్చించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సురేష్ , ఎంపీడీవో ఆంజనేయులు , అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుజాతమ్మ ,కానిస్టేబుల్ గోపాల్ నాయక్ , సూర్య ప్రకాశ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, నాగేశ్వరరావు, గీత,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రైస్ మిల్లర్లకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సంతోష్

## మిల్లర్లు కచ్చితంగా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలి: జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30(ప్రభాత %%)రైస్ మిల్లర్లకు ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కేటాయించాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ ను పౌరసరఫరాల కార్పొరేషన్ కు సమర్పించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వరి ధాన్యం కొనుగోలు పై మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు చేయాలంటే మిల్లర్లు కచ్చితంగా బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్లను సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మిల్లర్లను నాలుగు రకాలుగా విభజించడం జరిగిందని అందులో గతంలో ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లు 10 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది అన్నారు. రెండవ రకం మిల్లర్లు గత బకాయిలతో పాటు పెనాల్టీ ఉన్నవారు 20 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ అందించాలన్నారు. మూడవ రకం మిల్లర్లు 100 శాతం బకాయిలు చెల్లించి 25 శాతం పెనాల్టీ పెండింగ్ ఉన్నవారు 25 శాతం పెనాల్టీ లేదా 25 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే నాలుగో రకం మిల్లర్లు డిఫాల్టర్లు గా ఉన్నవారికి ధాన్యం కేటాయించబడదని కలెక్టర్ తెలియజేశారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ అభ్యర్థన మేరకు మిల్లర్లకు అదనపు మిల్లింగ్ చార్జీలు కూడా అందజేయడం జరుగుతుందని అన్నారు. దొడ్డు రకం ధాన్యానికి క్వింటాలకు రూ.30/- అలాగే సన్న రకానికి రూ. 40/- చెప్పన అదనపు మిల్లింగ్ చార్జీలు అందించడం జరుగుతుందని, మిల్లర్లకు కేటాయించగా మిగిలిన ధాన్యాన్ని ఇంటర్మీడియట్ గోదాములలో భద్రపరచడం జరుగుతుందన్నారు. మిల్లర్లు అందరూ వరి ధాన్యం కొనుగోలుకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలన్నరు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీనారాయణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.




## విద్యార్థుల వ్యక్తిత్వం, సమగ్ర వికాసం కోసం క్రీడల పోటీలు

### ఎన్టీఆర్ విద్యసంస్థల డీన్ రామారావు

వచ్చే నెల 4వ తేది నుంచి ఎన్టీఆర్ ట్రస్టీ అధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీలు

మొయినాబాద్ అక్టోబరు 30 (ప్రభాత ఉదయం) విద్యార్థుల వ్యక్తిత్వం, సమగ్ర వికాసం కోసం క్రీడల పోటీలను స్పోర్ట్స్ మీట్ పేరిట ఎన్టీఆర్ ట్రస్టీ అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ విద్యసంస్థల డీన్ రామారావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఎన్టీఆర్ విద్యసంస్థల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్న్ విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ మహిళల సాధారికత, వారిలోనా నైపుణ్యాన్ని తెలిసితీసేందుకు ఎన్టీఆర్ ట్రస్టీ చైర్మన్ నారా భువనేశ్వర్ కృతనిక్షయంతో పనిచేస్తోందని అలాగే విద్యార్థుల వ్యక్తిత్వం, సమగ్ర వికాసం కోసం క్రీడల పోటీలను రంగారెడ్డి జిల్లా స్థాయిలో ఈ ఏడాది నుంచి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వచ్చేనెల 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లా స్థాయిలో జరిగే అన్ని రకాల క్రీడల పోటీలను పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు క్రీడలు, సంస్క్రతీక పోటీలను ఎన్టీఆర్ విద్యసంస్థల అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు అన్ని క్రీడల్లో పాల్గొంటారని ఇంటర్, డిగ్రీ విద్యార్థినీలకు ప్రత్యేకంగా క్రీడల పోటీలను నిర్వహిం చనున్నట్లు తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బాలీబాల్, పెయింటింగ్, ర్యాంప్వాక్, రంగోలి, మేహంది, కరాటే ఫుడ్ఫెస్టివల్తో పాటు పలు సంస్క్రృతీక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు ఆసక్తిగల వారు ఎన్టీఆర్ విద్యసంస్థలో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. 4వ తేది నుంచి ప్రారంభమయ్యే ఈ క్రీడల పోటీల్లో జిల్లాలోని దాదాపు 30 పాఠశాలలకు చెందిన పాల్గొంటారని.. 4వ తేది రోజు తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరక్టర్ నార్మద ముఖ్యఅతిథిగా పాల్గోని క్రీడలను ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎసే.జే రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహా ఏఓ సురేష్, మట్టయ్య తదితరులు ఉన్నారు.



## రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ ఐ వూషూ ఎంపికైన కొత్తకోట ఐటిఐ విద్యార్థి

### గాడ్స్ ఆన్ వారియర్స్ విద్యార్థి ఎంపిక

కొత్తకోట, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం)మహబూబ్ నగర్ పట్టణంలోని మినీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్ 17 అండర్ 19 వూషూ పోటీలు నిర్వహించారు ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులు నవంబర్ 2 తేదీన మహబూబాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంటారు ఈ పోటీలలో మన వనపర్తి జిల్లా నుండి కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే ఎకాడమీకి చెందిన విద్యార్థి పాల్గొని ప్రథమ స్థానం సాధించారు అనిల్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు ఈ విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా ఉష్ణ సంఘం తెలిపింది ఈ సందర్భంగా గెలిచిన విద్యార్థిను ఉమ్మడి జిల్లా సెక్రెటరీ శారద, కొత్తకోట పట్టణానికి చెందిన శ్రీ వెంకటేశ్వర ఐటిఐ కళాశాల చైర్మన్ వి గంగాధర్, అధ్యాపకులు ఇంచార్జ్ జయప్రకాష్ , సతీష్, రమేష్ లు విద్యార్థిని అభినందించారు పథకం సాధించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా కరాటే మాస్టర్ జి హరీష్ యాదవ్, జాఫర్ సాదిక్, ఇంతియాజ్, అంజి పాల్గొన్నారు.



## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునేదే దీపావళి పండుగ

### మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్


కూకట్‌పల్లి,అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం) దీపావళి పండుగ సందర్భంగా బుధవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ రాష్ట్ర ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని, ఆ లక్ష్మీదేవి కటాక్షం అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని హిందూ బంధువులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఫతేనగర్ బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్, రఘు, కూకట్ పల్లి నాయకులు దుర్గాప్రసాదరావు, ప్రశాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం) ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... లక్ష్మీదేవి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దీపావళి వేడుకల్లో ప్రమాదాలు జరగకుండా అందరూ అప్రమత్తంగా పండుగ జరుపుకోవాలి. టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా నివారించాలి అని ఆయన అన్నారు.

## వరద బాధితులకు దుప్పట్లు, నిత్యవసరలో సరుకులు పంపిణీ చేసిన లైన్స్ క్లబ్



కూకట్‌పల్లి,అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ లో వరద బాధితుల సహాయార్థం లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఎమర్జెన్సీ గ్రాంట్ తో వరద బాధితులకు బుధవారం దుప్పట్లు, నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ డి . కోటేశ్వరరావు, రీజినల్ చైర్ పర్సన్ వి . శ్రీనివాసరావు, సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ సురేష్ జగనేని, లైన్స్ క్లబ్ బంజారాహిల్స్, లైన్స్ క్లబ్ ఆఫ్ మెగాసిటీ ప్రతినిధులు, కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, బండారి ప్రసన్న ఆంజనేయులు పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.